# ఇద్దరూ బిడ్డలే - ఇద్దరికీ తండ్రే - కానీ!

'ఆ ముసలిదానికి బదులు ఈ ముసిలాడైనా చచ్చాడు కదా. ఆవిడుంటే యింత కూరా నారా తరిగి, ఏదో వంట చేసిపడేసేది. ఆఫీసునుంచి ఇంటి కొచ్చేసరికి ఈయన గారు కాకిలా కాఫీ కోసం నోరెళ్ళ బెట్టుకుని కూర్చుంటాడు. ప్రొద్దున్న పదయ్యేసరికి ఆకలంటూ వంటింటికేసి పదిసార్లు తొంగిచూస్తాడు. చస్తున్నాను ఈ వెధవచాకిరీ చెయ్యలేక నాకీశనివదిలి మంచిరోజులు ఎప్పుడు వస్తాయో!" అంటూ దండకం చదువుతున్న సౌజన్యని చూస్తూ "ఊరుకోవే! నాన్నొచ్చేటైమయింది. వింటే బాగుండదు పెద్దవాడూ - ఏంచేస్తాడూ? బైటనుంచి ఏదోకూర, నార తెచ్చిపడేస్తున్నాడు కదా! పిల్లల్ని బడికి దింపితీసుకొస్తున్నాడు-"

"ఆ-చాలు చాలు మరో రెండేళ్ళు పోతే పిల్లలు వాళ్ళంతట వాళ్ళే బడికి వెళ్ళివస్తారు. కూరలు వాకిట్లోకే వస్తాయి. ఈయనగారికి తిండికయ్యే ఖర్చులో సగం డబ్బుపెడితే ఓ పనివాడొస్తాడు. ఈయన చేసే నిర్వాకం ఏం మండిపోవడంలేదు" అంటూ గట్టిగానే అంటున్న కోడలు సౌజన్య మాటలు విన్న వెంకన్నపంతులు వాకిట్లో అలాగే నిలబడి పోయాడు. బైటి కొచ్చిన కొడుకు తండ్రిని చూసి తత్తర పాటులో "బైటే నిలబడిపోయావేమిటి నాన్న! మంచినీళ్ళు కావాలా?" అంటూగట్టిగానే అనడంతో, ఆ మాటలు విన్న సౌజన్య నోరు కాస్త మూత పడింది.

అన్నం ముందు కూర్చున్న వెంకన్న పంతులికి ముద్ద దిగటంలేదు. నాలుగు మెతుకులు తిని చెయ్యికడుక్కుని లేచాడు. పడుకున్నాడేగానీ నిద్రపట్టడంలేదు.

తను చేసింది చిన్న ఉద్యోగమే! ఓ కొడుకూ, కూతురుతో సరిపెట్టుకున్నారు. భార్యాభర్తలిద్దరూ కొడుక్కి పెద్దచదువు చెప్పించారు. కూతురికి పి.యు.సి. చెప్పించి పెళ్ళి సంబంధాలు చూడసాగారు. "నాన్నా నాకిప్పుడే పెళ్ళొద్దు నాన్న! చదువుకుంటాను. డిగ్రీఅన్నా చెయ్యాలనివుంది" అంటూ వేడుకుంటున్న కూతుర్ని, "ఎంత చదివిస్తే అంతంత కట్నాలు పొయ్యాలి తల్లీ! పోనీ కట్నాలు పోసి పెళ్ళి చెయ్యగానే సరా-సారే, చీర, పండగలూ, పబ్బాలూ, పురుళ్ళూ, పుణ్యాలూ, బారసాల్లూ - ఇలా ఏదోవకటి వుంటూనే వుంటాయి. ఇవన్నీ అయ్యే సరికి మేము దివాళా తియ్యాల్సిందే! ఏదో పెళ్ళిచేస్తే ఆ చదువు ఖర్చన్నా కలిసొస్తుంది. ఇది మంచి సంబంధమే! ఏదో ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్ళాన్ని పోషించుకుంటాడు" అంటూ చిరాకుపడి పెళ్ళిచేసారు ఓ గుమస్తాకి యిచ్చి.

చదువుమీద ఆశ చావని ప్రమీల భర్తని ఒప్పించి బి.కాంలో చేరింది. మూడేళ్ళలో

బి.కాం. పూర్తిచేసి బ్యాంక్ ఉద్యోగాలకి అప్లై చెయ్యసాగింది. ఓ మంచి బ్యాంక్‌లో ఉద్యోగం సంపాదించి తల్లి, తండ్రులకి తెలియజేసింది. ఆ విషయం విన్న తండ్రి మాత్రం సిగ్గుతో కుంచించుకు పోయాడు.

భార్య పట్టుదల, ఉత్సాహం చూసి ప్రమీల భర్త వర్ధన్ కూడా ప్రయివేటుగా ఎం.బి.ఏకి కట్టి కొన్నాళ్ళకి మంచి కంపెనీలో ఉద్యోగం సంపాదించాడు. వీళ్ళిద్దరూ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. వాళ్ళకి యిద్దరు పిల్లలు.

అప్పుడప్పుడు వచ్చిపోయే కూతురితో మనసు విప్పి మాట్లాడలేక పోయేవారి దంపతులు. భార్యా, భర్తలిద్దరూ ప్రమీల పుట్టింటి వారేమిచ్చినా ఎంతో నమ్రతతో తిరస్కరించేవారు "అమ్మా అన్నీ వున్నాయమ్మా! ఎందుకు మాకు మళ్ళీ పెడతారు? పసుపు, కుంకుమా, జాకెట్ బట్టా యివ్వండి చాలు" అంటూ ప్రమీల మర్యాదగా తిరస్కరిస్తుంటే – "మామయ్య గారూ ఇలాంటి లాంఛనాలు నాకు యిష్టముండవు. నేను మీ కొడుకులాంటి వాడినే" అని అంటూంటే ఎవరో చెంపమీద చెళ్ళుమని కొట్టినట్లుండేవా మాటలు. తల్లీ తండ్రితో తమింటికొచ్చి కొన్నాళ్ళుండమని ఎన్నోసార్లు బ్రతిమాలింది. వీళ్ళకే ముఖం చెల్లక కూతురికి చేసిన అన్యాయానికి సిగ్గుపడి పోయేవారు. కూతురు చదువుకుంటానంటే చదువు చెప్పించక పోవడం, ఓ గుమస్తాకిచ్చి పెళ్ళి చెయ్యడం తల్చుకుని సిగ్గుపడేవారు.

కొడుకు సైంటిస్టుగా మంచి ఉద్యోగంలోనే వున్నాడు. కోడలు కూడా ఉద్యోగస్తురాలే! భార్య బ్రతికి ఉన్నన్నాళ్ళూ వంటమనిషీ, పనిమనిషీ అయి ఆ ఇంటికి చాకిరీ చేసింది. రెండు నెలల క్రితం స్వర్గస్తురాలయింది. ఉన్న ఆస్తి అమ్మి కొడుకేదో నిర్వాకం చేస్తాడని చదువు చెప్పించాడు. కనీసం ప్రావిడెంట్ ఫండన్నా వుంచుకున్నాడా అంటే ఆ డబ్బూ కొడుక్కే యిచ్చాడు. "నాన్నా పట్నాల్లో ఇల్లద్దెలు చాలా ఎక్కువ. నేను ఆఫీసులో కొంతలోను తీసుకుంటాను, నీ ప్రావిడెంట్ ఫండూ, ఆ డబ్బూ కలిపి ఓ ఫ్లాట్ కొనుక్కుందాం", అంటే ఆ డబ్బూ యిచ్చేసాడు. భార్యమెడలో పుస్తెల గొలుసూ, జత గాజులూ కోడలికీ, కూతురికీ ఇచ్చాడు. "నాకెందుకు నాన్నా బంగారం? వీళ్ళ దగ్గరుంటావు, అన్నా, వదినా నిన్ను బాగా చూసుకోవాలి, వాళ్ళకే యియ్యి" అంటూ ఆ బంగారం కూడా అన్న కూతురి చేతిలో పెట్టింది ప్రమీల.

కూతురాడే ప్రతీమాటా మెత్తని కత్తితో పొడుస్తున్నట్లుండేది వెంకన్న పంతులికి.

ఇప్పుడు జరిగిందేమిటి? కొడుకు కోడలికి ఎదురు చెప్పలేడు. కోడలు హయాం చెల్లించి వీళ్ళని పనివాళ్ళల్లా చూసేది. అప్పుడప్పుడు అనిపించేది ప్రమీల దగ్గర కెళ్ళి కొన్నాళ్ళు వుందామా! అని కానీ ఏముఖం పెట్టుకుని వెళ్ళగలరు? ఆమె చదువుకుంటానంటే అన్నమాటలు గుర్తొస్తే తల కొట్టేసినట్లుంటుంది. చిన్న ఉద్యోగస్తుడికిచ్చి పెళ్ళి చేసినా ఏమీ మాట్లాడకుండా, ఒక్క రోజూ తమని దెప్పకుండా స్వయంకృషి మీద ఈనాడు భార్య భర్తలిద్దరూ పెద్ద, పెద్ద ఉద్యోగస్తులయ్యారు. వాళ్ళకేం చేసామని వాళ్ళింటి కెళ్ళగలం! ఒక్క పైసన్నా దాచుకోకుండా

వీళ్ళకంతా యిచ్చేసినందుకు ఏమాత్రం విశ్వాసం లేకుండా వీళ్ళున్నారు. తానొకటి తలిస్తే దైవమొకటన్నట్లుంది తన జాతకం. తను చదివించిన కొడుకు తన వాడు కాదు. తన డబ్బు పెట్టి కొన్న ఇంటిలో ఒక్క గది కూడా తనది కాదు అంటూ బాధ పడసాగాడు.

రెండు రోజులు శలవలని తండ్రిని చూడాలని వచ్చింది ప్రమీల. కోడలాడిన మాటలు ప్రమీలతో చెప్పుకుని ఏడ్చేసాడు వెంకన్న పంతులు. ఇంత బాధని కడుపులో పెట్టుకుని బాధపడుతున్న తండ్రిని జాలిగా చూసింది. తనతో తీసుకెళ్తాను రమ్మనగానే "రాలేను తల్లీ! నీకు చేసిన అన్యాయానికి ఏ ముఖం పెట్టుకుని నీ గడప తొక్కాలి? నీకేం చేసాము?" అంటూ బాధపడుతున్న తండ్రిని ఊరడించి, టిక్కెట్టుకొని తండ్రిని తనతో బయలుదేర దీసింది ప్రమీల.

తండ్రికో గది కేటాయించింది. వంటమనిషి వంటచేసి తండ్రికి పెట్టేది. సాయంకాలాలు పిల్లల్ని తండ్రినీ కారులో ఎక్కడికో ఓ చోటుకి తిప్పిరమ్మని డ్రయివర్నిచ్చి పంపేవారు. తను పుట్టి ఏనాడూ ఎరుగని సౌఖ్యాలన్నీ కూతురింట అనుభవిస్తున్నాడు. కూతురెంత ప్రేమగా చూస్తోంటే అంత బాధగా వుంటోంది. ఆ ప్రేమ, అభిమానం కడుపులో ఎవరో చెయ్యిపెట్టి కెలికినట్లుంటోంది. తన పట్ల కనపరుస్తున్న ఆప్యాయత ములుకుల్లా గుచ్చుకుని బాధిస్తున్నాయి. ఏదో చెప్పలేని సిగ్గు మనసుని పిండేస్తోంది. కోడలాడే మాటలతో ఆమె పెట్టిన తిండి ఎక్కేదికాదు. ఇక్కడ ఆప్యాయంగా పెడుతున్న తిండి గొంతు దిగటం లేదు. పిల్లలకి ఓ ఐస్‌ఫ్రూట్ కొనివ్వాలన్నా చేతిలో పైసలేదు. ఇలా మనశ్శాంతి లేక అక్కడ వుండలేక పోతున్నాడు. ఆప్యాయంగా పెట్టే తిండి కంటే కోడలు చూపే అనాదరణే భరించగలడేమో! అనిపించేదొక్కోసారి.

ఉదయం ఆఫీసుకెళ్తున్న కూతుర్ని చూసి "అమ్మా ప్రమీలా! నాకు టిక్కెట్టు కొనమ్మా, బాబు దగ్గరకి వెళ్తాను" అన్నమాటలకి "వచ్చి వారం రోజులేకదా అయింది నాన్నా! కంగారేమిటి? ఓ నెల్లాళ్ళున్నావుండు". అంటున్న కూతుర్ని చూసి లేదమ్మా కూతురింట్లో ఎన్నాళ్ళుంటాను! అనగానే అల్లుడు 'అదేమిటి మామయ్యగారూ! మీకు కొడుకొకడూ, అల్లుడొకడూనా? ఏంపరవాలేదు కొన్నాళ్ళుండండి', అన్నా వినకుండా "మళ్ళీ వస్తానులే బాబూ, టిక్కెటు తీసుకురండి" అంటున్న మామ గారిని చూసి "సరే డ్రయివర్ని పంపించి తెప్పిస్తాను" అన్నాడు వర్ధన్.

తండ్రి మనసులోని భావాలని గ్రహించిన ప్రమీల ఆయన్ని వెళ్ళకుండా, ఆపుదామని ప్రయత్నించినా కుదరడం లేదు. తండ్రిని తీసుకొచ్చాక అన్నా, వదినా కనీసం ఓ కార్డన్నా రాయలేదు. అక్కడికి వెళ్తే ఆయన గతి మళ్ళీ మామూలే! అనుకుంది. తనే ఫోన్ చేసి అప్పుడప్పుడు అన్నగారితో మాట్లాడి తండ్రి క్షేమం చెప్పేది తప్ప అటునుంచి ఎప్పుడూ కబురుండేది కాదు.

తప్పని సరయి తండ్రికి టిక్కెట్టు కొని తెప్పించారు. వచ్చే ఆదివారానికి టిక్కెట్టు దొరికింది. 70 ఏళ్ళు దాటిన తండ్రిని "ఒక్కడివీ అంత దూరం వెళ్ళగలవా నాన్నా!" అనగానే 'రైలెక్కితే అంతా నావాళ్ళేనమ్మా!" అన్నాడు.

తండ్రి ప్రయాణం గురించి అన్నయ్యకి చెప్పగానే కాస్త కంగారే పడ్డట్టుంది గొంతు. "కొన్నాళ్ళుంచుకోక పోయావా? ఇక్కడాయనకి మునిగిపోయే పనులేమున్నాయి? కంగారేమిటొచ్చిందాయనకి? ఇక్కడికన్నా అక్కడే ఆయనకి సదుపాయంగా వుంటుంది. కొన్నాళ్ళు పోయాకా పంపిద్దు గాని, కొంపలేం మునగటం లేదు" అన్న అన్నయ్య మాటలకి ఏమీ అనలేక "ప్రయత్నిస్తానన్నయ్యా!" అని మాత్రం అంది.

రెండు రోజుల్లో తండ్రి ప్రయాణం. సాయంత్రం ఇంటికి వచ్చిన కూతురు "నాన్నా నీ ప్రయాణం ఓ ఏడాదికి వాయిదా పడింది", అనగానే "ఏడాదికా?!" అంటూ తెల్లబోతూ "అదేమిటీ? ఎందుకూ?" అన్నాడు ఆశ్చర్యంగా "అన్నయ్యకి విదేశం వెళ్ళే ఛాన్సు వచ్చిందట. వదినా, పిల్లల్ని కూడా తీసుకెళ్తున్నాడట. కొన్నాళ్ళు నాన్నని నీ దగ్గరుంచుకో. నాన్నకి ఖర్చులకి డబ్బులు పంపిస్తూ వుంటానని ఫోన్ చేసాడు. సో, నీటిక్కెట్టు కేన్సిల్ చేసాము" అంటూ చెప్పగానే శిలలానే నిలబడిపోయాడు.

ఇక తప్పక కూతురింట్లో వుంటున్నాడు వెంకన్న పంతులు, నెల నెలా ఓ వెయ్యి రూపాయలు తెచ్చి అన్నయ్య పంపిన డబ్బు అని తండ్రి చేతికిచ్చేది. కొడుకు పంపే డబ్బు చూసాకా ఆయనలో కాస్త మార్పు కనిపెట్టారాదంపతులు. అందులో కొంత డబ్బు కూతురికిచ్చి "కూతురి సొమ్ము వూరికే తినకోడదమ్మా!" అనేవాడు 'పోనీలే నాన్న నీ తృప్తి మాకూ ఆనందం' అంటూ ఆ డబ్బు తీసుకునేది. మిగిలిన డబ్బుతో పిల్లలకి అవీ యివీ కొని పెట్టేవాడు.

ఇప్పుడు వెంకన్న పంతులులో ఓ రకమైన తృప్తి ఆత్మవిశ్వాసమూ కలగసాగాయి. కూతురి సొమ్ము తింటున్నానన్న బెంగ తగ్గింది. ఎంతయినా కొడుకుకదా! తండ్రంటే అభిమానం లేకుండా వుంటుందా! డబ్బన్నా పంపిస్తున్నాడు. ఆనందంగా హుషారుగా తిరుగుతున్న తండ్రిని చూసి లోలోనే ఆనందపడింది ప్రమీల.

నన్ను క్షమించు నాన్నా! నేను ఎంత తప్పుపని చేస్తున్నానో నీకు తెలియదు. తెలిస్తే నన్ను క్షమించవు. నీలోని అంతర్మథనం గ్రహించి అబద్ధం ఆడాను నాన్నా! నీ కొడుకు ఫారిన్ వెళ్ళనూలేదు - నీకు డబ్బు పంపడమూ లేదు. కూతురికి ఏం చెయ్యలేదు, కూతురి సొమ్ము తింటున్నానన్న నీలోని బాధని అర్థం చేసుకుని, నీ కొడుకు ఫారిన్ వెళ్ళాడనీ నీకు డబ్బు పంపిస్తున్నాడనీ అబద్ధం చెప్పాను. పిచ్చినాన్నా! ఎలాగున్నావని కనుక్కోని నీకొడుకూ, నీ దగ్గరకి వస్తున్నాడు నాన్న అని చెప్పగానే అప్పుడే పంపొద్దన్న నీ కొడుకూ నీకు డబ్బు పంపిస్తున్నాడా? అబద్ధాలు దాగవు. ఏదో రోజు నిజం బైటపడుతుంది. ఏడాది దాకా ఈ అబద్ధం దాగితే అన్నయ్యకి మరో ఏడాది అక్కడ వుండటానికి పర్మిషన్ వచ్చిందని మరో అబద్ధం ఆడతాను. నిజం తెలిసేదాకా అయినా నీ మనసు తృప్తిగా ఆనందంగా వుంటుంది. అదే మాకూ కావలసింది", అనుకుంది ప్రమీల తండ్రిలోని ఆనందం, హుషారూ చూసి.

**- చినుకు, ఆగస్టు 2005**